## క్లుప్తంగా

### పారిజాతగిరిలో పూజలు



పారిజాతగిరివాసుడిని దర్శించుకుంటున్న భక్తులు

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగనివేదన, తోమాల సేవ, తీర్థప్రసాదగోష్టి తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నల్లూరి రుషికేష్, రాఘవ ఆచార్యులు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు చిన్నారి నిహాన్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా అతని కుటుంబసభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలకు వేదాశీర్వాదం అందజేసి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

### తపస్య స్కూల్‌కి నోటీసులు జారీ



పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎంఈఓలు సుబ్బారావు, ప్రశాంత్ కుమార్

**కామవరపుకోట:** ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని మండల విద్యాశాఖ అధికారులు డి.సుబ్బారావు, సీహెచ్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. శనివారం వారు కామవరపుకోటలోని చెక్ పోస్ట్ సెంటర్ సమీపంలో నిర్వహిస్తున్న తపస్య స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ గుర్తింపు, అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ తపస్య స్కూల్‌కు ప్రభుత్వ అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం వలన టీసీలకు, ప్రభుత్వ పథకాలకు ఇబ్బంది పడతారన్నారు.

### ఏజెన్సీలో భారీ వర్షం

**బుట్టాయగూడెం:** ఏజెన్సీ ప్రాంతంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నా రాత్రి 9 గంటలకు ఒక్కసారిగా ఈదురుగాలులతోపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి.

### ఉచిత వైద్యశిబిరం



కొండ్రుకోట పునరావాస కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**పోలవరం రూరల్:** పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని కొండ్రుకోట పునరావాస కేంద్రంలో ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నిఖిల్ శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి ఏలూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీవీ విజయ్‌కుమార్, మెడిసిన్ విద్యార్థులు హాజరయ్యారు. వైద్యశిబిరంలో రోగులకు అందించే వైద్యసేవలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మలేరియా అధికారి డి.సురేష్, పోలవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### ద్వారకాతిరుమల సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా పవన్ చక్రవర్తి



బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్ చక్రవర్తి

**ద్వారకాతిరుమల:** స్థానిక శ్రీ వేంకటేశ్వర విశాల సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జిగా వి.పవన్ చక్రవర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం సొసైటీలను 6 నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జిలతో కొనసాగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అన్ని సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. అందులో భాగంగా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఏలూరు డివిజన్‌లో పనిచేస్తున్న పవన్ చక్రవర్తిని ద్వారకాతిరుమల సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన సంఘ కార్యదర్శి నల్లూరి శ్రీకిషోర్ నుంచి చార్జిని స్వీకరించారు.

### దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

**ఏలూరు (టూటౌన్):** తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని వికలాంగుల సంక్షేమ సంఘం వీసాస్, ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజ్ కోరారు. పర్సంటేజ్ పేరుతో గతంలో దివ్యాంగులను తొలగించారని పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగునికీ కొత్త ప్రభుత్వం రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచే దివ్యాంగుల పింఛన్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులు పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రాజీతో ఇరుపక్షాలూ గెలిచినట్టే

- చింతలపూడి లోక్‌అదాలత్‌లో 81 కేసులు పరిష్కారం
- జంగారెడ్డిగూడెంలో 142 కేసుల పరిష్కారం



చింతలపూడి కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్

**చింతలపూడి:** రాజీతో ఇరుపక్షాలూ గెలిచేనట్టేనని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. శనివారం చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 81 కేసులు పరిష్కరించారు. వాటిలో 21 బ్యాంక్ కేసులు, 6 టెలిఫోన్ బకాయి కేసులు, 48 క్రిమినల్ కేసులు, 6 సివిల్ కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కాంపౌండింగ్ ఫీజు కింద రూ.42,96,354 వసూలు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు మాట్లాడారు. లోక్‌అదాలత్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. లోక్‌అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని, ఇరుపక్షాలూ గెలిచినట్లేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి నాగేశ్వరరావు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలి, న్యాయవాదులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెంలో...**

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం న్యాయస్థానాల ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ పాల్గొని కక్షిదారుల కేసులను పరిష్కరించారు. జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోదగ్గ ప్రతి కేసును కక్షిదారులు పరిష్కరించుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రిమినల్ కేసులు 36, ఎక్సైజ్ కేసులు 2, సివిల్ కేసులు 6, మనోవర్తి కేసులు 7, గృహహింస కేసులు 3, చెక్కుబౌన్స్ కేసులు 61, బెంచ్ కోర్టు కేసులు 68, బీఎస్ఎన్ఎల్ కేసులు 13 మొత్తం 142 కేసులు పరిష్కారమైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

### జూలై 1 నుంచి ఇంటివద్దే పింఛన్ల పంపిణీ

**పోలవరం రూరల్:** జూలై 1 నుంచి పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ అందించడం జరుగుతుందని ఎంపీడీవో జి.శ్రీను తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పింఛన్‌దారుల ఇంటివద్దకే గ్రామ సచివాలయం, ఇతర సిబ్బంది వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు. లబ్ధిదారులు పింఛన్ కోసం గ్రామ సచివాలయాలకు వెళ్లనవసరం లేదన్నారు. ఉదయం 6 గంటల నుంచి ఇళ్ల వద్దే పింఛన్ అందించడం జరుగుతుందన్నారు.

### వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం:** ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఉమామహేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న గోలి హరీష్ కుమార్ దాంపత్య సమస్యలతో విడాకుల కేసు పెట్టాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన హైదరాబాద్ చాణిక్యపురి కాలనీకి చెందని గోలి గౌరీశంకర్, మరో 8మంది జంగారెడ్డిగూడెంలోని హరీష్‌కుమార్ ఇంటికి వచ్చి విడాకుల కేసు పెడతావా అంటూ తనపై దాడి చేశారని, దీంతో తీవ్రంగా గాయపడిన తాను రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని హరీష్‌కుమార్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో నిందితులపై కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశించినట్లు హెచ్‌సీ తెలిపారు.

### జంగారెడ్డిగూడెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా గురజాల



జి.వెంకటేశ్వరరావు

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా గురజాల వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీలో నగదు దుర్వినియోగానికి సంబంధించి ఇప్పటివరకు కార్యదర్శిగా ఉన్న రత్నాజీ సస్పెండ్ అయ్యారన్నారు. అధికారులు నిర్వహించిన విచారణలో నగదు దుర్వినియోగానికి సంబంధించి ఆధారాలు లభించడంతో రత్నాజీని సస్పెండ్ చేశారని, ఆయన స్థానంలో తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. కాగా జంగారెడ్డిగూడెం పీఏసీఎస్ చెందిన ఖాతాదారులు సోమవారం నుంచి కార్యాలయ సేవలు యథావిధిగా పొందవచ్చని తెలిపారు.

### నూటికి నూరుశాతం రుణాల వసూళ్లు

**పోలవరం రూరల్:** మండలంలోని కృష్ణారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 2023–24 సంవత్సరంలో అన్ని రకాల రుణాలను నూటికి నూరుశాతం వసూలు చేసినట్లు సంఘ కార్యదర్శి కారిపిరెడ్డి రాంబాబు తెలిపారు. డిమాండ్ మొత్తం రూ.718.11 లక్షలు కాగా, నూరుశాతం వసూలు చేశామన్నారు. ఇలా నూటికి నూరు శాతం వసూలు చేయడం వరుసగా ఇది 9వ సంవత్సరమని తెలిపారు. అలాగే సంఘం జిల్లా సహకార బ్యాంకుకు చెల్లించవలసిన డిమాండ్ కూడా 100 శాతం చెల్లించడం జరిగిందని రాంబాబు చెప్పారు. అదేవిధంగా సంఘం 2023–24 ఆర్థిక సంవత్సరం రూ.15.66 లక్షలు లాభం ఆర్జించిందని తెలియజేశారు. ఈ రుణాలు వసూళ్లకు రైతులు ఎంతగానో సహకరించారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వసూళ్లకు ప్రోత్సహం అందించిన జిల్లా సహకార బ్యాంకు అధికారులకు, జిల్లా సహకార శాఖ అధికారులకు, డివిజనల్ సహకార శాఖ అధికారలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ సురేష్



సింగన్నపల్లిలో జరుగుతున్న స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న డీఎంఓ సురేష్

**బుట్టాయగూడెం:** జిల్లాలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ జె.సురేష్ తెలిపారు. మండలంలోని సింగన్నపల్లిలో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల పరిధిలో ఇప్పటివరకూ సుమారు 59 గ్రామాల్లో మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు జరిగినట్లు తెలిపారు. అలాగే బుట్టాయగూడెం మండలంలో 21 గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కాచిన నీటిని సేవించాలని చెప్పారు. అలాగే మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు చేస్తున్న సమయంలో తప్పనిసరిగా ఇంటిలోపల కూడా స్ప్రేయింగ్ పనులు చేయించారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందాలన్నారు. డెంగీ, మలేరియా జ్వరాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను తప్పనిసరిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భాగ్యశ్రీ, సబ్‌యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఫైర్‌స్టేషన్ వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

**చింతలపూడి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మేరీ ఇమ్మాక్యులేట్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ సోఫియా అన్నారు. శనివారం పట్టణంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫైర్‌స్టేషన్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. సిస్టర్ సోఫియా మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రకృతి సమతుల్యం ఎంతో అవసరం అన్నారు. అసమతుల్య పర్యావరణం మానవ మనుగడను ప్రశ్నార్థం చేస్తుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కను నాటడం, సంరక్షించడంతో పాటు వాతావరణం కాలుష్య కారకాలను నివారించే పద్ధతులను అవలంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘మానవత’ ద్వారా విస్తృత సేవలు



పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న దృశ్యం

**చింతలపూడి:** మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం మానవత మండల శాఖ అధ్యక్షుడు పి సోమశేఖరాచార్యులు అధ్యక్షతన నూతన మండల కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మానవత 120 శాఖలు కలిగి ఉందని చెప్పారు. లక్షా 10 వేల మంది సభ్యులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మానవత సంస్థలో చేరి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన కె మహిత, ఎం నీహారిక, పి చరణ్ కుమార్‌లను సభలో సత్కరించి ఒక్కొక్కరికీ రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతిగా డైరెక్టర్లు మాడా సత్యన్నారాయణ, మాడా శ్రీనివాసరావు అందించారు. అదే విధంగా మానవత భవన నిర్మాణానికి కె శ్రీరామచంద్రమూర్తి రూ.25 వేలు, నాగసూరి నాగేశ్వరరావు రూ.20 వేలు, పసుమర్తి ప్రకాశరావు రూ.10 వేలు విరాళాలు అందించారు.

**నూతన కమిటీ ఎన్నిక**

మానవత చింతలపూడి మండల శాఖ నూతన కమిటీ అధ్యక్షురాలుగా కె రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా పి సోమశేఖర్, కోశాధికారిగా జె విశ్వేశ్వరరావులతో పాటు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా మానవత నాయకులు ఆర్ గంగాధర్, టి త్రిపురా రమేష్, డి రత్నాకర్, ఎం అజయ్, ఎ సత్యన్నారాయణ, ఎ రాజారావు, ఎ అప్పారావు, ఎం శామ్యూల్, కె నాగ చిన్నారావు, టి అప్పారావు, టి విజయకుమార్, సత్యేంద్రకుమార్, గ్జేవియర్ తదితరులు పాల్గొన్నారు.

## దంత సంరక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకోండి



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**చింతలపూడి:** దంత సంబంధ వ్యాధుల పట్ల విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ దంతవైద్య నిపుణులు డా బి రాంబాబు సూచించారు. స్థానిక ఎస్‌బీఐ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ దంతవైద్య శాల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఎటువంటి దంత సమస్యలు ఉన్నా తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి చికిత్స పొందాలని సూచించారు. దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శిబిరంలో 30 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అవసరమైన పేస్టులు, బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ –2 కిరణ్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగీ బాధ్యతగా పనిచేయాలి



రిటైర్డ్ హెచ్‌ఎం రామసుందరిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

**కామవరపుకోట:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ బాధ్యతగా పనిచేయాలని కామవరపుకోట మండల విద్యాశాఖ అధికారి–2 ప్రశాంత్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని రమా సుందరి ఉద్యోగ విరమణ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో పదో తరగతిలో మండల స్థాయిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంలో రమాసుందరి కృషి ఎనలేనిదని అన్నారు. పాఠశాల విధులు నిర్వహిస్తూనే తనకు రచనలపై ఉన్న ఆసక్తితో హిందీ, ఇంగ్లిషు భాషలలో పేరొందిన రచనలను తెలుగులోకి అనువాదం చేశారని కొనియాడారు. అనంతరం రమాసుందరికి శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంబీజేఆర్.ప్రసాదరావు, డాక్టర్ మేడూరు సత్యంబాబు, మేడూరు రంగబాబు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు టీవీఎస్ రాజు, వీరమల్ల మధు, ఎస్.రాజారావు, ఉమామహేశ్వరరావు, కె.అంజిబాబు, ఎం.రామ్ కుమార్, లక్ష్మణరావు, ఆచార్యులు, ప్రసాద్ రావు పాల్గొన్నారు.

### స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

**కుక్కునూరు:** బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు కూటమి నాయకుల చేతుల మీదుగా స్టూడెంట్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాలలో ఖాళీగా ఉన్న ఫిజికల్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరనున్నట్టు చెప్పారు. అదేవిధంగా ఈ విద్యాసంవత్సరం 10వ తరగతిలో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,116, రూ.5116 బహుమతిగా అందించనున్నట్టు చెప్పారు.

## ఐటీడీఏను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



కేఆర్‌పురం ఐటీడీఏలో పీఓ సూర్యతేజతో సమావేశమైన ట్రైనీ కలెక్టర్‌ల బృందం

**బుట్టాయగూడెం:** ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శనివారం కేఆర్‌పురం ఐటీడీఏను సందర్శించింది. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ (ఐఏఎస్)తో పీఓ ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ప్రాముఖ్యత, ప్రాజెక్టు ఆయకట్టు వివరాలు అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న గ్రామాలు, ఆర్‌అండ్‌ఆర్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీఓ సూర్యతేజ పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలు, నిర్వాసితులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్‌లు సీహెచ్ కళ్యాణి(కర్నూలు), దమేరా హిమ వంశీ(చిత్తూరు), బొల్లిపల్లి వినుత (అనంతపురం), పవార్ స్వప్నిల్ జగన్నాథ్(గుంటూరు), హెచ్ఎస్ భావన (కాకినాడ), శుభమ్ నోఖ్వాల్ (ఎన్టీఆర్ జిల్లా) తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు సీఆర్‌ఆర్ విద్యార్థిని



నాగసింధును సత్కరిస్తున్న విద్యాసంస్థల ప్రతినిధులు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఐ.నాగసింధు వాటర్ పోలో క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ పి.సాయి కుమారి శంకర్ తెలిపారు. నాగసింధును శనివారం సీఆర్ఆర్ విద్యా సంస్థల పరిపాలనా కార్యాలయంలో సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్ ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న నాగసింధు ఈ నెల 23వ తేదీన విజయవాడలో జరిగిన వాటర్‌పోలో పోటీల్లో పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపికైందని, వచ్చే నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోందని వివరించారు.

### ప్రభుత్వ ఆసుపత్రికి స్టేషనరీ బహూకరణ



స్టేషనరీ సామగ్రిని విరాళంగా అందిస్తున్న దృశ్యం

**కొయ్యలగూడెం:** బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి రూ.30 వేలు విలువ గల స్టేషనరీ సామగ్రిని నాటకశాల వెంకటరాజు శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ రెండేళ్లకు సరిపడా ఓపీ చీటీలు, కేసు షీట్లు, ప్రిస్క్రిప్షన్ ఫారాలు వెంకటరాజు ప్రింటింగ్ చేయించి ఇచ్చారని చెప్పారు. గతంలో కూడా ఆయన రూ.2 లక్షలు విలువైన ఫర్నీచర్‌ను ఆసుపత్రికి అందించారని, ఆసుపత్రి అభివృద్ధికి వెంకటరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** యూనియన్ (ఆంధ్రా బ్యాంక్ ) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన 10వ తరగతి, ఆ పైన విద్యార్హత గల 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల యువకులు ఫోన్ నెంబర్లు 99485 65256, 95330 79471లో సంప్రదించాలని సూచించారు.